సాక్షి తిరుపతి

శనివారం । 2 । ఆగస్టు । 2025



సత్తా చాటిన ఏకొల్లు జెడ్పీ విద్యార్థినులు

జిల్లా స్థాయిలో నిర్వహించిన జూడో అండర్‌-14 విభాగంలో ఏకొల్లు జెడ్పీ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. - 8లో



విద్యాసంస్థల్లో కెమెరాలు ..

జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల్లో మెరుగైన కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ కోరారు. - 8లో



14న మత్స్యకారులకు ఇళ్ల పట్టాలు

మత్స్యకారులకు ఇళ్ల పట్టాలను ఈనెల 14న అందిస్తామని శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ తక్షణ ప్రవేశాలు

తిరుపతి సిటీ : ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన జరగనున్న స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో పలు కోర్సులకు సంబంధించి 35 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

తిరుపతి సిటీ : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2025లో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 ఏళ్ల సర్వీసు కలిగిన అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తులను ఈనెల 8వ తేదీలోపు ఆయా ఉప విద్యాశాఖ అధికారుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రేణిగుంట : ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జరిగిన ఐదవ జాతీయ గ్రాప్లింగ్ పోటీలలో రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటి నాలుగు బంగారు పతకాలు, ఐదు వెండి పతకాలు, మూడు రజిత పతకాలు సాధించారు. వీరిని శుక్రవారం పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలు శ్యామల, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు రోటరీ క్లబ్ వారు ఆర్థిక సాయం అందించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మలేషియా వర్సిటీతో ఎస్వీడబ్ల్యూ కళాశాల ఒప్పందం



ఎంఓయూ చేసుకుంటున్న మలేషియా వర్సిటీ అధ్యాపకులు, ఎస్వీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : యూనివర్సిటీ ఆఫ్ మలేషియా తెరెంగ్గాన్‌తో పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల మధ్య విద్యాభివృద్ధిపై ప్రతిష్టాత్మక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు శుక్రవారం పద్మావతి డిగ్రీ కళాశాల బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ, మలేషియా వర్సిటీ ఫిషరీస్ అండ్ ఫుడ్ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ మన్సూర్ ఇస్మాయిల్ షేక్ ఒప్పందపు పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్య, పరిశోధన, సాంస్కృతిక అంశాలతో పాటు విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలపై పరస్పర సహకారం అందిపుచ్చుకునేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సి భువనేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో 'అక్షరధామ్' గురువులు



ఆధ్యాత్మిక గురువులకు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఢిల్లీలోని ప్రముఖ అక్షరధామ్ స్వామి నారాయణ్ ఆలయానికి చెందిన ఆధ్యాత్మిక గురువులు అక్షర్ ప్రేమ్, వినమ్రవదన్ శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వారికి వివరించారు. పర్యటనలో భాగంగా పారిశ్రామికవాడ పరిసరాలతో పాటు స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన శ్రీసిటీ ఉద్యానవనాన్ని స్వామీజీలు సందర్శించారు. అక్కడ నుంచి డైకిన్ ఏసీ పరిశ్రమకు వెళ్లి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. పచ్చదనం, పర్యావరణం, ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్న శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రశంసించిన స్వామీజీలు, శ్రీసిటీ ఎండీని అభినందిస్తూ ఆశీర్వచనాలు అందజేశారు. దక్షిణ భారతదేశంలో శ్రీ సిటీ కేంద్రంగా స్వామి నారాయణ్ ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని ఈ సందర్భంగా వారికి ఎండీ విజ్ఞప్తి చేశారు.

కోతల సుఖీభవ





అన్నదాతలకు కూటమి ప్రభుత్వంలో మరోసారి నిరాశే ఎదురైంది. అన్నదాత సుఖీభవ పథకానికి గత ఏడాది ఖరీఫ్, రబీ డబ్బులు మొత్తం ఎగనామం పెట్టి రైతుల పొట్ట కొట్టింది. ప్రస్తుతం ఈ ఏడాది జిల్లాలో 25 వేల మంది రైతులకు నిబంధనల పేరుతో సుఖీభవ పథకానికి కోతలు పెట్టింది. ప్రతి రైతు కుటుంబానికి రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు కేంద్రం ఇచ్చే సాయంతో కలిపి రూ.20 వేలు ఇస్తామని మెలిక పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 1,80 లక్షల మందికి రైతు భరోసా అందగా నేడు అన్నదాత సుఖీభవకు 1,54 లక్షల మందినే అర్హులైన రైతులుగా గుర్తించడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు అన్నదాత సుఖీభవ పథకం విడుదల నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- 25,746 రైతులకు సుఖీభవ కట్
- రైతుల సంఖ్య పెరిగినా.. అర్హుల సంఖ్య తగ్గింపు
- 2023-24లో 1,80,654 రైతులకు రైతు భరోసా
- 2025-26కి 1,54,908 రైతులే ఎంపిక
- సర్కార్ తీరుపై అన్నదాతల అసంతృప్తి
- నేడు అన్నదాతలకు 'సుఖీభవ' నిధులు విడుదల

నియోజక వర్గాల వారీగా తగ్గిన రైతుల వివరాలు...

	2023-24 అర్హులు	2025-26	తగ్గిన రైతులు
సత్యవేడు	33,944	29,653	4,291
శ్రీకాళహస్తి	31,838	27,847	3,991
చంద్రగిరి	30,347	26,062	4,285
గూడూరు	25,965	22,217	3,748
సూళ్లూరుపేట	32,685	26,563	6,122
వెంకటగిరి (3 మండలాలు మాత్రమే)	16,767	14,975	1792
నగరి (2 మండలాలు మాత్రమే)	9,105	7591	1514

తిరుపతి అర్బన్ : రైతుల సంఖ్య పెరిగినా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హుల సంఖ్య తగ్గించారు. గత వైఎస్సార్‌సీపీ సర్కారులో అర్హుల జాబితాతో కూటమి సర్కారు జాబితాను పోల్చుకుంటే 25,746 మందికి సుఖీభవ పథకాన్ని దూరం చేశారు. సాధారణంగా ఏటా రైతుల సంఖ్య జిల్లాలో 10 వేల మందికి పైగా పెరుగుతూ వస్తుంటారు. 2020లో 2 లక్షల మంది రైతులు జిల్లాలో ఉండగా, 2025లో వారి సంఖ్య 2.55 లక్షలకు పెరిగింది. ఐదేళ్లలో 55 వేల మంది రైతులు పెరిగారు. ఓ రైతు తండ్రి స్థానంలో తమ భూములను కుమారులకు పంచుతున్న తరుణంలో రైతుల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు ఏటా బీడు భూములు సైతం సాగులోకి వస్తున్న తరుణంలో రైతుల సంఖ్య పెరుగుతోంది. 2019-2024 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 90 వేల ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చాయి. మొత్తంగా చూస్తే రైతులకు పెట్టుబడి సాయం కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీని మొదటి ఏడాది తుంగలో తొక్కారు.

నిబంధనల పేరుతో తొలగింపు

రైతుల సంఖ్య పెరిగినప్పటికీ 2023-24తో పోల్చుకుంటే అర్హుల సంఖ్య 25,746 మందిని తగ్గించారు. 2023-24లో 1,80,654 మంది రైతులకు రైతు భరోసా ఇచ్చారు. సాధారణంగా ఏటా రైతుల సంఖ్య పెరుగుతూ రావడం తెలిసిందే. తిరుపతి జిల్లాలో ప్రస్తుతం రైతులు 2,55,000 మంది ఉన్నారు. ఈ ఏడాది 2 లక్షల మందికి వరకు సుఖీభవ పథకానికి అర్హులు ఉంటారని అధికారులు అంచనా వేశారు. అయితే ఈకేవైసీ, విద్యుత్ బిల్లులు, కారు, అధిక భూములు అంటూ పలు నిబంధనలు పెట్టడంతో కేవలం 1,54,908 మందిని మాత్రమే అన్నదాత సుఖీభవకు ఎంపిక చేశారు. గత సర్కార్ 1,80,654 మందికి ఏటా పెట్టుబడి సాయం చేస్తే...కూటమి సర్కార్ అందులో 25,746 మందిని సుఖీభవ పథకానికి దూరం చేయడంపై పలువురు రైతులు మండిపడుతున్నారు. ఒక ఏడాది పూర్తిగా ఎగనామం పెట్టిన కూటమి ప్రభుత్వం... రెండో ఏడాది వడపోత పోయడంపై పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ సర్కార్‌లో రైతు భరోసాతో పోల్చుకుంటే జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ అర్హుల జాబితాను తగ్గించేశారు. అత్యధికంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో 6,122 మంది రైతులు పథకానికి దూరం అయ్యారు.

నేటి నుంచి పథకానికి శ్రీకారం

ఏటా రైతులకు రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ 2024-25 పథకాన్ని అమలు చేయలేదు. ఈ ఏడాది 2025-26కి సంబంధించి పథకాన్ని శనివారం అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, రాష్ట్ర సర్కారు రూ.5 వేలు చొప్పున మొత్తంగా రూ.7 వేలు రైతు ఖాతాల్లోకి జమ కావాల్సి ఉంది. తాజాగా పీఎం కిసాన్ మొత్తాన్ని మినహాయించి రూ.14వేలు మూడు విడతల్లో ఇస్తామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు. తాజాగా 25,746 మంది రైతులకు ఈ పథకానికి కూటమి సర్కారు దూరం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల పాటు వైఎస్సార్ రైతు భరోసా పేరుతో 8,74,146 మంది రైతులకు రూ.663.07 కోట్లు అందించారు. ఏటా రైతులకు రూ. 13,500 చొప్పున పెట్టుబడి సాయం చేశారు. అర్హులైన అందరికీ అవకాశం కల్పించారు. పార్టీలు, కులాలు, మతాలకు తావులేకుండా పారదర్శకంగా గత ప్రభుత్వం పథకాన్ని ఇచ్చిందని రైతులు చెబుతున్నారు.

నిరాశ చెందుతున్న అన్నదాతలు

కూటమి సర్కార్ 2024-25లో అధికారంలో ఉన్నప్పటికీ మొదటి ఏడాది 'అన్నదాత సుఖీభవ' కింద పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన చంద్రబాబు సర్కారు కనీసం రెండో ఏడాదైనా అర్హులైన అందరికీ అందిస్తారని భావించిన రైతులకు నిరాశ ఎదురవుతోంది. మే నుంచి జూలై వరకు తేదీల మీద తేదీలు ప్రకటించినా ఆచరణకు నోచుకోని పరిస్థితి నెలకొంది. తాజాగా ఆగస్టు 2న (శనివారం) పీఎం కిసాన్‌తో పాటు 'అన్నదాత సుఖీభవ' సొమ్ములు ఇస్తామని ప్రకటించారు. కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా రైతులకు చేసింది శూన్యమనే చెప్పాలి. ఏటా రూ.20 వేలు ఇస్తామని ఘనంగా ప్రకటించిన చంద్రబాబు... మొదటి ఏడాది పైసా ఇవ్వకుండా దాటేశారు. పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.14 వేలు మూడు విడతల్లో ఇస్తామని ప్రకటించారు. పీఎం కిసాన్ కింద గతేడాది మూడు విడతల్లో రూ.6 వేలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.14 వేలు ఇవ్వకపోవడంతో జిల్లా రైతులు రూ 220 కోట్ల పైచిలుకు కోల్పోయారు. ఎలా చూసినా గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రూపొందించిన జాబితాతో పోల్చుకుంటే 25,746 మంది రైతులకు 'సుఖీభవ' దక్కే పరిస్థితి లేకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

ఆయుష్ సేవలు మరింత బలోపేతం

- తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి



పార్లమెంటులో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : జిల్లాలో ఆయుష్ సేవలను మరింత బలోపేతం చేయాలని ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంటులో ఆయుష్ వ్యవస్థల అభివృద్ధి, ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలపై వివరాలు తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ప్రజారోగ్యం రాష్ట్రాల పరిధిలోకి వస్తుందని, ఆయుష్ రంగంలో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సిన అవసరం ఉంటుందని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల తీసుకునే చర్యలకు అన్ని విధాలుగా సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా గత ఐదేళ్లలో రూ.28.82 కోట్ల మేర కేంద్రం నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపినట్లు వివరించారు. ఈ నిధులతో కాకినాడ, విశాఖపట్నంలో 50 పడకల సమీకృత ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటు చేయాలని, మరో నాలుగు ఆయుష్ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇచ్చిందని చెప్పారు. తిరుపతి ఆయుష్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎంపీ గురుమూర్తి కోరారు.

ఎంఈఓ-1 నియామకాలపై ఆగ్రహం



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అపస్ నాయకులు, ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ : ఎంఈఓ-1 నియామకాలపై కూటమి పాలనపై ఏపీ ఉపాధ్యాయ సంఘం మండిపడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈఓ-1 నియామకాలు చేపట్టిన తీరు నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ.. ఉమ్మడి సర్వీస్ నిబంధనల అమలు కోసం ప్రత్యేక కమిటీ ద్వారా సాధించడానికి ఉపాధ్యాయ సంఘాలు ప్రయత్నిస్తున్న తరుణంలో మండల విద్యాశాఖ అధికారి-1 కేవలం ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడం దారుణమన్నారు. నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహాలు దారుణం

- డీఆర్‌ఓకు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతల వినతి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

తిరుపతి రూరల్ : జిల్లాలోని బాల, బాలికల ప్రభుత్వ వసతి గృహాలు దారుణంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా పలు ప్రభుత్వ, సంక్షేమ వసతిగృహాలను సందర్శించిన అనంతరం సమస్యల ప్రతిని శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి నర్సింహులును కలిసి అందజేశారు. అనంతరం విద్యార్థి నాయకులతో కలసి ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జిల్లాలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను పరిశీలించామని తెలిపారు. ప్రభుత్వం పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మరుగుదొడ్లు, బాత్ రూములు నిర్మించాలని డిమాండు చేశారు. అలాగే వసతి గృహాల్లోని విద్యార్థులందరికీ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టళ్లకు సన్నబియ్యం పంపిణీ చేయాలన్నారు. ప్రతీ హాస్టల్లోనూ పిల్లలకు బెడ్స్, ప్లేట్లు, దుప్పట్లు, గ్లాసులు, ట్రంకు పెట్టెలు అందించాలన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, వసతిగృహాలలో సిబ్బందిని నియమించి, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా కార్యవర్గ, నియోజకవర్గ, యూనివర్సిటీ, మండల అధ్యక్షుడు భాను ప్రకాశ్ రెడ్డి, దినేష్ రెడ్డి, చంగల్ రెడ్డి, ప్రేమ్ కుమార్, జస్వంత్ కుమార్ రెడ్డి, మహమ్మద్ రఫీ, యశ్వంత్ కుమార్ రెడ్డి, హరిబాబు,ముని, వినోద్ కుమార్, ప్రదీప్ కుమార్, పార్థసారథి, శేషారెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

అక్రమ స్కానింగ్ పార్ట్-2!

మళ్లీ తెరపైకి అక్రమ స్కానింగ్

- చిత్తూరు కలెక్టర్ పట్టుకున్న అక్రమ స్కానింగ్‌లో ఇది పార్ట్-2
- చిత్తూరులో గుట్టురట్టు కావడంతో తిరుపతిలో ముఠా మకాం
- ఓ క్లినిక్ అడ్డాగా లింగనిర్ధారణ
- తప్పుడు నిర్ధారణతో తమిళనాడుకు చెందిన గర్భిణితోపాటు కుమార్తె ఆత్మహత్య!
- భర్త ఫిర్యాదుతో కేసు నమోదు!



కాణిపాకం/తిరుపతి తుడా: మళ్లీ తెరపైకి అక్రమ స్కానింగ్ బాగోతం వెలుగులోకి వచ్చింది. గతంలో చిత్తూరు కలెక్టర్ పట్టుకున్న అక్రమ స్కానింగ్ వ్యవహారం పార్ట్-2 కథను తలపిస్తోంది. చిత్తూరులో గుట్టు రట్టు కావడంతో ఈ ముఠా తిరుపతికి మక్కాం మార్చింది. అక్కడ అక్రమ స్కానింగ్‌ను గుట్టుగా నడిపించింది. వీరిచ్చిన తప్పుడు రిపోర్టుతో ఓ గర్భిణి, గర్భిణి కుమార్తెను బలితీసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో తమిళనాడు పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో ముఠాను అరెస్ట్ చేసి... భవానీ నగర్‌లోని అక్రమ స్కానింగ్, ఓ ప్రైవేటు ఆస్పత్రిని సీజ్ చేశారని రెండు జిల్లా అధికారులు వెల్లడించారు. ఇందులో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఓ సిబ్బంది పాత్ర కీలకమని తెలిసింది. దీనిపై చిత్తూరు కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి, వన్ టౌన్ పోలీసులు చర్చించినట్లు సమాచారం.

గర్భిణితో పాటు ఆడ బిడ్డను చంపేశారు!

వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమాచారం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకి చెందిన ఓ గర్భిణికి తొలి కాన్పులో ఆడబిడ్డ జన్మించింది. రెండో సారి గర్భవతి కావడంతో ఆగర్భిణి ముఠా వలలో పడింది. నెల కిందట తిరుపతికి వచ్చింది. స్కానింగ్ చేయించుకుని కడుపులో ఉన్నది ఆడ బిడ్డగా తెలుసుకుంది. ఇంటికెళ్లి అబార్షన్ చేయించుకుంటానని పట్టుపట్టింది. కుటుంబీకులు ఇందుకు ఒప్పుకోకపోవడంతో కుమార్తెతో పాటు ఆ గర్భిణి బావిలో దూకి చనిపోయింది. దీనిపై భర్త ఇచ్చిన ఫిర్యాదుతో తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేశారు. గర్భిణి మృతదేహాన్ని పోస్టు మార్టం చేయగా..క డుపులో ఉన్నది మగబిడ్డగా నిర్ధారణ అయ్యింది. దీంతో అక్రమ స్కానింగ్ సెంటర్‌పై అక్కడి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

చిత్తూరు సిబ్బందిదే కీలక పాత్ర

చిత్తూరులో పట్టుబడ్డ అక్రమస్కానింగ్ ముఠా సభ్యులే.. ఈ గర్భిణి మృతికి కూడా కారణమని తమిళనాడు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. వీళ్లను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ ముఠాకు .గుడిపాల మండలంలో పనిచేసే ఓ అటెండర్ (డీఎంఅండ్‌హెచ్ఓ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది) ముందుండి నడిపిస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఇతనిని కూడా తమిళనాడు పోలీసులు రిమాండ్‌కు తరలించగా.. అతను మూడు రోజుల క్రితమే బయటకు వచ్చినట్లు కార్యాలయమంతా గుసగుసలు మొదలయ్యాయి. ఇతనే ముఠాకు స్కానింగ్ మిషన్లను కొనుగోలు చేసి ఇచ్చినట్లు చిత్తూరు శాఖలో చర్చ సాగుతోంది. ఇతనితో పాటు జీడీనెల్లూరుకు చెందిన ఓ ఆశా వర్కర్, పాలసముద్రంకు చెందిన ఓ ఏఎన్ఎం పాత్ర కూడా ఉందని చిత్తూరు వైద్య ఆరోగ్యశాఖలో చర్చించుకుంటున్నారు. అయినా వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సమాచారం. ఈ మేరకు పోలీసులు చిత్తూరు కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్ఓతో చర్చించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆశావర్కర్‌పై రెండు రోజుల్లో చర్యలు ఉంటాయని చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. కాగా తిరుపతి భవానీ నగర్‌లో నడిపిస్తున్న స్కానింగ్ సెంటర్‌ను తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. దీంతో పాటు ఒక మెటర్నిటీ ఆస్పత్రిని కూడా సీజ్ చేశామని తిరుపతి డీఎంఅండ్‌హెచ్ఓ తెలిపారు.

అక్రమ స్కానింగ్ ఇలా..

మూడు నెలలకు క్రితం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరు నగరంలోని భరత్‌నగర్‌లో అక్రమ స్కానింగ్ సెంటర్ నిర్వహణ ముఠాను.. రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. 22 మందిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. తాజాగా దీని పార్ట్-2 కథ బయటకు వచ్చింది. చిత్తూరులో పట్టుబడ్డ ముఠానే మళ్లీ తిరుపతి భవానీ నగర్‌లో అక్రమ స్కానింగ్‌ను ఏర్పాటు చేసుకుని లింగనిర్ధారణను కొనసాగిస్తూ వచ్చింది. దీనిపై చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే కొందరు ఉద్యోగులు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అక్రమ స్కానింగ్ సెంటర్‌పై వారు నిఘా పెట్టారు. తమిళనాడు నుంచి గర్భిణులను తీసుకొచ్చి తిరుపతిలో లింగనిర్ధారణ చేయిస్తూ జేబులు నింపుకుంటున్నారని గుర్తించారు. ఒక్కొక్కరి దగ్గరి నుంచి ఫీజుగా రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు గుంజుకుంటున్నారని తెలుసుకున్నారు. వీళ్ల నిర్ధారణలో ఓ గర్భిణికి ఇచ్చిన రిపోర్టు తప్పు అని తేలడంతో వీళ్ల బండారం మొత్తం బయటపడింది.

చేతులు మారిన స్కానింగ్ మిషన్!

కాణిపాకం: చిత్తూరులోని భరత్‌నగర్‌లో మూడు నెలలక క్రితం అక్రమ స్కానింగ్ సెంటర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ సీజ్ చేశారు. ఇక్కడ దొరికిన స్కానింగ్ మిషన్‌ను విచారణ అనంతరంకలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అప్పగించారు. ఈ మిషన్ కంపెనీ ఆధారంగా తమిళనాడు నుంచి బయటకు వచ్చినట్లు తెలుసుకున్నారు. ముఠా సభ్యులు స్కానింగ్ మిషన్‌ను ఎవరి దగ్గర నుంచి కొనుగోలు చేశారో తెలుసుకోవడానికి గట్టిగానే ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయత్నంలో భాగంగా స్కానింగ్ మిషన్ 16 మంది చేతులు మారినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు.

నూతన ఆవిష్కరణలకు ఏఎన్‌ఆర్‌ఎఫ్ సహకారం



శివకుమార్ కల్యాణరామన్

ఏర్పేడు : శాస్త్ర, సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణలకు ఏఎన్‌ఆర్‌ఎఫ్ (అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్) నిబద్ధతతో పనిచేస్తోందని సీఈవో శివకుమార్ కళ్యాణరామన్ అన్నారు. శుక్రవారం ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీని సందర్శించి, సహకార పరిశోధనా కార్యక్రమాలు, ఆవిష్కరణ వ్యూహాలపై అధ్యాపకులతో చర్చించారు. సహకార, అంతర్ విభాగ పరిశోధన ప్రతిపాదనలను పెంపొందించడం, ప్రభావవంతమైన పరిష్కారాల కోసం లోతైన సాంకేతిక పరిశోధన, అభివృద్ధి, ఆర్ అండ్‌డీ వ్యూహాలను గురించి వివరించారు. పరిశోధకుల సామర్థ్య నిర్మాణం, అధునాతన పరిశోధన గ్రాంట్లు, కన్వర్జెన్స్ హబ్-అండ్-స్పోక్ పరిశోధన నమూనాలు, పీఎం-ఈసీఆర్‌జీ పథకం, మెడ్‌టెక్‌లో సవాళ్లను పరిష్కరించడం వంటి అంశాలపై లోతుగా చర్చించారు. భారతీయ సంస్థలలో పరిశోధనా నైపుణ్యం, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

కోట : కొత్తపాళెం సమీపంలోని చల్లకాలువ వద్ద శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ పవన్‌కుమార్ విచారణ చేపట్టారు. కొత్తపాళెంకు చెందిన ఆంజనేయకుమార్(52)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సమస్యల కారణంగా రాత్రి గొడవ పడి ఇంట్లో నుంచి వచ్చి చెట్టుకు ఉరేసుకున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీఆర్వో రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సత్తా చాటిన ఏకొల్లు జెడ్పీ విద్యార్థినులు

దొరవారిసత్రం : జిల్లా స్థాయిలో నిర్వహించిన సబ్ జూనియర్స్ జూడో అండర్–14 విభాగం నందు మండలంలోని ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో సత్తా చాటారు. జెడ్పీ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని హేమలత (57 కిలోల విభాగం), 7వ తరగతి విద్యార్థిని ఏంజెల్ (52 కిలోల విభాగం)లో బంగారు పతకాలు సాధించగా 8వ తరగతి విద్యార్థిని ఇందు (48 కిలోల) విభాగం నందు రజత పతకం సాధించినట్లు హెచ్‌ఎం నరసింహారావు తెలిపారు. ఆగస్టు 9,10 తేదీల్లో గుంటూరులో రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధం చేస్తున్నట్లు పీఈటీ మాస్టర్ రమణయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు పతకాలు , సర్టిఫికెట్లు శనివారం అందజేసి సత్కరించారు. అభినందించిన వారిలో ఎంఈఓలు కొండయ్య, కృష్ణయ్య, హాస్టల్ వార్డెన్ శేషమ్మ, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐటా ఉమెన్స్ సింగిల్స్ విజేత లక్ష్మీసిరి



టోర్నీ విన్నర్‌గా నిలిచిన లక్ష్మీసిరి

గూడూరు రూరల్ : తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో జులై 28 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జరిగిన ఐటా (ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్) ఉమెన్స్ వన్ ల్యాక్ టోర్నమెంట్‌లో గూడూరు పట్టణానికి చెందిన లక్ష్మీసిరి గెలుపొందింది. ఈమె క్వార్టర్ ఫైనల్స్‌లో తెలంగాణకు చెందిన తానియాసాపై 6–0, 1–0 (రిటైర్డ్) తో గెలుపొందింది. సెమీ ఫైనల్స్‌లో తెలంగాణకు చెందిన మనోజ్ఞ మదసుపై 6–1, 2–6, 4–1(రిటైర్డ్) గెలుపొందింది. అదే విధంగా ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన జోయల్ నికోల్‌పై 6–1, 6–3 తేడాతో గెలుపొంది , టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఆమె గతంలో పలు అంతర్జాతీయ, జాతీయ టోర్నమెంట్‌లలో పాల్గొని పలు పతకాలను సాధించింది.

• ఇంటింటికీ మంగళం



జీడీ నెల్లూరులోని పెన్షన్ల కోసం పడిగాపులు కాస్తూ...



సప్తగిరి నగర్‌లో చెట్టు చెంత లబ్ధిదారులకు పింఛన్ ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు



ఎస్‌కేడీనగర్‌లో ఓ దుకాణం వద్ద...



చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పింఛన్ల పంపిణీ మళ్లీ మొదటికొచ్చింది. గత టీడీపీ పాలనలో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం పడ్డ కష్టాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎన్నికల ముందు వలంటీర్లు లేకపోయినా ఇంటి వద్దకే పింఛన్లు ఇస్తామన్న కూటమి పెద్దలు సోమవారం సచివాలయాలు, నడివీధుల్లో గంటలు తరబడి నిల్చోబెట్టి పంపిణీ చేశారు. ఈ పరిస్థితిని చూసి లబ్ధిదారులు ఇందుకేనా మేము ఓట్లేసింది' అంటూ నిట్టూర్చడం కనిపించింది. ఈ దృశ్యాలను శుక్రవారం తిరుపతి, జీడీ నెల్లూరు నియోజకవర్గాల్లో కనిపించిన చిత్రాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి

ఫెర్టిలిటీ సెంటర్లలో వరుస తనిఖీలు



ఫెర్టిలిటీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని ఫెర్టిలిటీ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వరుస తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఫెర్టిలిటీ సెంటర్లలో సంతానోత్పత్తి పేరుతో జరిగే మోసాలు, వైద్యంపై ఫిర్యాదులు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్, అంకుర ఎస్ ఫెర్టిలిటీ సెంటర్లను తనిఖీచేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శాంత కుమారి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలను చేపట్టారు. నిబంధనల ప్రకారం ఆస్పత్రులను నడపాలని, నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని నిర్వాహకులను ఆమె హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డాక్టర్ త్రివేణి, సిబ్బంది కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో ప్రజాస్వామ్యం బలోపేతం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

పాకాల : సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. రాజనీతి శాస్త్రం అధ్యాపకులు ఆదిశేఖర్‌రెడ్డి సమాచార హక్కు చట్టం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ఎస్.కె.జాస్మిన్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి, చిట్టికళావతి, కార్యక్రమ కన్వీనర్ ఈశ్వర్‌బాబు, రమణమ్మ, రేఖ పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసుల్లో నిందితులకు జైలు

తిరుపతి లీగల్ : రెండు వేరువేరు చెక్ బౌన్స్ కేసుల్లో ఇద్దరు నిందితులకు ఆరు నెలలు చొప్పున జైలు శిక్ష, ఐదువేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ తీర్పు చెప్పారు. చంద్రగిరి మండలం, కల్ రోడ్డు పల్లికు చెందిన దొండపాటి మధుమతి తన అవసరాల కోసం తిరుపతి, రైల్వే కాలనీకి చెందిన మాచర్ల వెంకటరామయ్య వద్ద 2016 నవంబర్ 19వ తేదీ రూ.4,50,000 అప్పుగా తీసుకుని ప్రోనోటు రాసి ఇచ్చాడు. అసలు, వడ్డీ చెల్లించే క్రమంలో ఆమె 2018 నవంబర్ 19వ తేదీ 6,60,000 చెక్కును అతడికి ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో కోర్టులో మధుమతిపై చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పరిశీలించిన న్యాయమూర్తి ఆమెకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా మరో కేసులో రేణిగుంట, టెలిఫోన్ క్వార్టర్స్ కు చెందిన ప్రస్తుతం తిరుపతి ,దాసరి మఠం వీధిలో నివసిస్తున్న ఆరంభాకం చంద్రశేఖర్ కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. గణేష్ రెడ్డికి ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. దీంతో గణేష్ రెడ్డి నిందితుడు చంద్రశేఖర్ పై చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేశాడు.

శ్రీవారి హుండీలో చోరీ చేసిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్ : తిరుమల శ్రీవారి ప్రధాన హుండీలో సొమ్మును అపహరించిన కేసులో చంద్రగిరి జోగుల కాలనీకి చెందిన నరేష్ అలియాస్ మహేష్‌కు నెలరోజుల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.... 2022 నవంబర్ 16వ తేదీ సాయంత్రం శ్రీవారి ప్రధాన హుండీలో 9600 రూపాయలను నిందితుడు నరేష్ అపహరించాడు. కేసు పూర్వపరాలు పరిశీలించి నరేష్‌కు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

అధిక శబ్దం చేసే సైలెన్సర్ల ధ్వంసం



సైలెన్సర్లను రోడ్ రోలర్లతో ధ్వంసం చేస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: జిల్లాలో అధిక శబ్దం కలిగిస్తున్న సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేస్తున్నామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. అందులో భాగంగా తిరుపతి నగరంలో అధిక శబ్దం కలిగిస్తున్న 65 ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తొలగించి శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశామని తెలిపారు. అదేవిధంగా 500 వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా అమర్చుకున్న అధిక శబ్దం కలిగించే హారన్‌లను తొలగించి ధ్వంసం చేసినట్టు చెప్పారు.

అడవిలోకి చొరబడుతున్న వ్యక్తి అరెస్టు

తిరుపతి మంగళం : పిచ్చాటూరు ప్రాంతంలో నిషేధిత అడవుల్లోకి ప్రవేశిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి పిడిలేని ఇనుప గొడ్డలిని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎఫ్‌బీవో కలిసి పుత్తూరు రేంజ్, పాలమంగలం అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. అరణ్య కండ్రిగ అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కనిపించగా వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, అడవుల్లోకి పారిపోయారన్నారు. అయితే టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక వ్యక్తిని పట్టుకుని అతడి వద్ద నుంచి పిడిలేని గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిని తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

టీటీడీకి రూ.25 లక్షల విరాళం



విరాళాన్ని స్వీకరిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల: హైదరాబాద్‌కు చెందిన పి.శ్రీకాంత్ అనే భక్తుడు శుక్రవారం టీటీడీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.25 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆయన డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు.

9 నుంచి సప్త మోక్ష క్షేత్ర యాత్ర రైలు సేవలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టూర్ టైమ్స్ డైరెక్టర్ విగ్నేష్

తిరుపతి కల్చరల్ : సప్త మోక్ష క్షేత్ర యాత్ర సెప్టెంబర్ 9న రైలు ద్వారా దేశంలోని పలు పుణ్య క్షేత్రాల సందర్శనకు మంచి ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలని టూర్ టైమ్స్ డైరెక్టర్ విగ్నేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సప్తమోక్ష క్షేత్ర యాత్ర రైలు ప్యాకేజీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 రోజుల పాటు దేశవ్యాప్తంగా ఏడు నదులు, నాలుగు జ్యోతిర్లింగాల ప్రాంతాలను ఈ ప్యాకేజీ ద్వారా చూపించి తిరిగి వారి స్వస్థలాలకు తీసుకురావడం జరుగుతుందన్నారు. 650 మంది ప్యాసింజర్లను ఈ యాత్ర రైలు ద్వారా తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. మూడు విభాగాలుగా ఈ ప్రత్యేక రైలులో ప్యాకేజీ టికెట్ ధరను నిర్ణయించామని తెలిపారు. థర్డ్ ఏసీ(కంఫర్ట్) రూ.45,750, సెకండ్ ఏసీ(డీలక్స్) రూ.54,100, ఫస్ట్ ఏసీ(లగ్జరీ) రూ.69,500గా ఉన్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తొట్టంబేడు : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తొట్టంబేడు మండలంలో చోటు చేసుకుంది స్థానికుల కథనం మేరకు తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం వద్ద ఓ వాహనం ద్విచక్ర వాహనంలో వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి(50)ని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తొట్టంబేడు పోలీసులు అక్కడికి చేరుకుని మృతుడి వివరాల కోసం ఆరా తీశారు. లభ్యం కాకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చూరీకి తరలించి కేసు నమోదు చేశారు.

పలు పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, చిల్లకూరు, డక్కిలి, కోట, నాయుడుపేట, పుదూరు, సూళ్లూరుపేట, వాకాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వాకాడు పాఠశాలలో ఐదో తరగతిలో ఉన్న పరిమిత ఖాళీలకు, నాయుడుపేటలోని తొమ్మిదో తరగతిలో ఉన్న ఖాళీలకు, నాయుడుపేట, చిల్లకూరులోని పాఠశాలల్లో బైపీసీ, ఎంపీసీ, వాకాడులో సీఈసీ, ఎంఈసీ ఖాళీలకు, పుత్తూరులోని సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సుల్లో ఉన్న ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు జిల్లా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించి, ఈ నెల 11లోపు నేరుగా ప్రవేశాలు పొందాలని తెలియజేశారు.

కాలువ ఆధునీకరణ పనులపై నివేదిక ఇవ్వండి



శ్రీసిటీలోని కరిపేటి కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వరదయ్యపాళెం: శ్రీసిటీ మీదుగా వెళ్లే ఇరిగేషన్‌కు చెందిన కరిపేటి కాలువ ఆధునీకరణ పనులకు సంబంధించి పూర్తి స్థాయి నివేదికను అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీసిటీలోని కరిపేటి కాలువను కలెక్టర్ సందర్శించారు. ఇటీవల శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ కళాశాల సమీపంలో కరిపేటి కాలువ సంబంధించి శ్రీసిటీ యాజమాన్యం కాలువ పూడికతీత పనులతో పాటు కట్టను బలోపేతం చేసే పనులను చేపట్టారు. అయితే ఈ పనులకు సంబంధించి అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాలువలో పూడికతీత పనులకు సంబంధించి తవ్విన మట్టిని బయటకు తరలిస్తున్నారని కేవీబీపురం మండలం మద్రాసు బాబు హైకోర్టులో కేసు వేశారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు పూర్తి వివరాలను అందించాలని కలెక్టర్‌కు సూచించడంతో ఆయన పనులు జరిగిన కరిపేటి కాలువను సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం శ్రీసిటీ పరిధిలోని ఈస్ట్ మల్లవారిపాళెం చెరువును పరిశీలించారు.

నకిలీ మీడియాను అరికట్టేందుకే స్టిక్కర్ల పంపిణీ



వాహనానికి పోలీస్ స్టిక్కర్ అంటిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లా వ్యాప్తంగా నకిలీ మీడియాను అరికట్టేందుకు ప్రస్తుతం వర్కింగ్ జర్నలిస్టులందరికీ స్టిక్కర్లను పంపిణీ చేశామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఆయన శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే వాళ్లు కూడా మీడియా ప్రతినిధులుగా చెలామణీ అవుతున్నారని తెలిపారు. అంతే కాకుండా చాలామంది వాహనాలపై ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు అంటించుకుని తిరుగుతున్నారని తెలిపారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి కొన్ని వందల వాహనాలకు స్టిక్కర్లు తొలగించామన్నారు. నిజాయితీగా వర్కింగ్ జర్నలిస్ట్‌గా ఉన్న వారందరికీ గుర్తింపు ఇచ్చేందుకు పోలీస్ విభాగం తరఫున ద్విచక్ర వాహనాలు, కార్లకు స్టిక్కర్లను పంపిణీ చేశామన్నారు. ఈ స్టిక్కర్ తగిలించుకున్న మీడియా ప్రతినిధులు ఎలాంటి ప్రోగ్రాములకైనా పోలీసుల ద్వారా ఇబ్బంది లేకుండా అనుమతి ఇస్తామన్నారు. అంతేకాకుండా ఈ స్టిక్కర్ స్కాన్ చేస్తే ఆ మీడియా ప్రతినిధి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఎడిషన్‌లో పనిచేసే పాత్రికేయుల వాహనాలకు వున్న ఈ స్టిక్కర్లను చూసి పోలీసులు అనుమతి ఇస్తారని వెల్లడించారు. ఈ స్టిక్కర్లను కాపీ చేయకుండా పకడ్బందీగా తయారు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ మురళి, సెక్రటరీ బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో కెమెరాలు తప్పనిసరి

తిరుపతి క్రైమ్: జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో అత్యంత మెరుగైన కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవి మనోహరాచారి తెలిపారు. నగరంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్కూలు, కాలేజీల యాజమాన్యాలతో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యాసంస్థలు ఏర్పాటు చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందన్నారు. అయితే స్కూల్ పెట్టడం ఎంత ముఖ్యమో దాని భద్రత కూడా అంతే ముఖ్యమని తెలిపారు. తక్కువ పని తీరు గలిగిన కెమెరాలను తొలగించి అత్యధిక పరిణామాలు కలిగిన కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటర్ చదువుతున్న పిల్లలు కూడా మైనర్లే కనుక ఎవరైనా రాజకీయ నాయకుల సభలకు సమావేశాలకు పంపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో విద్యాసంస్థల యజమానులు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

14న మత్స్యకారులకు ఇళ్ల పట్టాలు

తడ : మత్స్యకారులకు పూడి గ్రామం వద్ద కేటాయించిన భూమికి సంబంధించిన పట్టాలను ఈనెల 14వ తేదీన అందిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మిగిలిన ఎస్సీ, ఎస్టీ కులాల వారికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ శుక్రవారం ఇరకం వచ్చారు. పడవ ప్రయాణం అనంతరం ట్రాక్టర్ మీద గ్రామంలోకి చేరుకున్న ఆయన పింఛన్ల కార్యక్రమం ప్రారంభించి స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, డీఆర్‌డీ ఏపీడీ శోభన్‌బాబు, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రేపటి వరకు గురుకులంలో అడ్మిషన్లకు అవకాశం

తిరుపతి అర్బన్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లోని ఖాళీ సీట్లలో ప్రవేశానికి ఆదివారం వరకు అవకాశం ఉందని జిల్లా సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి పోటీ పరీక్షలు లేకుండా నేరుగా ప్రవేశం పొందవచ్చన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో నాయుడుపేట, కోట, వాకాడు పాఠశాలల్లో ఐదవ తరగతిలో చేరడానికి, నాయుడుపేటతో 9వ తరగతి, నాయుడుపేట, చిల్లకూరులో బైపీసీ, ఎంపీసీ, వాకాడులో సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరడానికి బాలురికి అవకాశం ఉందన్నారు. అలాగే పుత్తూరులోని కళాశాలలో సీఈసీ, హెచ్‌ఈసీలో చేరడానికి బాలికలకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

16 పీహెచ్‌సీల్లో పింక్ బస్ క్యాంపులు

తిరుపతి తుడా: స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో ఈ నెలలో జిల్లాలోని 16 పీహెచ్‌సీల్లో పింక్ బస్ క్యాంపులు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇందులో బీపీ, షుగరు పరీక్షలతోపాటు మహిళలు, పురుషులకు నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల నిర్ధారణకు మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు. 4న కేవీబీపురం మండలంలోని కోవనూరు పీహెచ్‌సీలో, 7న నిడిగుర్తి, చిన్నపాండూరు, 11న పళ్లిపేడు, చింతవరం, 14న వరగళి, బాలిరెడ్డిపాళెం, 18న జికె.పల్లి, చెన్నూరు, 21న బాలాయపల్లి, డక్కిలి, 25న చిట్టేడు, చిల్లకూరు, 28న దాసుకుప్పం, బంగారుపేట పీహెచ్‌సీలో క్యాంపులు నిర్వహిస్తామని వెల్లడించారు.

మద్యం మత్తులో చెరువులోకి దిగి యువకుడి మృతి

సత్యవేడు : సత్యవేడు పంచాయతీ ఎస్సీ కాలనీ చెందిన జేమ్స్(33) మద్యం మత్తులో చెరువులో స్నానానికి దిగి నీట మునిగి మృతి చెందాడు. ఎస్సీ కాలనీకి చెందిన జేమ్స్ మత్తుకు బానిసై జులాయిగా తిరిగేవాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన జేమ్స్ దళవాయి అగ్రహారం చెరువు కట్టపై ఉన్న గుడి వద్ద చిన్న పనులు చేసి వచ్చిన డబ్బుతో మద్యం తాగి ఆ మత్తులో చెరువులోకి స్నానానికి దిగి నీటిలో మునిగి పోయాడు. శుక్రవారం ఉదయం చెరువులో శవం తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని బయటకు తీయించారు.

జగన్ పర్యటనను స్టేటస్ పెట్టాడని ఉపసర్పంచ్‌పై దాడి



ఈశ్వరయ్య పొలం వద్ద గుమికూడిన టీడీపీ గూండాలు



బాధితుడి వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన వార్తలను స్టేటస్‌గా పెట్టాడని పాకాల మండలం మద్దినాయనపల్లి పంచాయతీ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం కమిటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డేరంగుల ఈశ్వరయ్యపై టీడీపీ నాయకులు శుక్రవారం మూకుమ్మడిగా దాడిచేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం నెల్లూరు పర్యటించిన సందర్భంగా చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని, సీఎం చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు కుట్ర పన్ని ఇలాంటి అక్రమ అరెస్టులు చేస్తున్నారని అన్నారు. ఈ వాఖ్యలను ఉపసర్పంచ్ డేరంగుల ఈశ్వరయ్య తన వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నారు. అలా వాట్సాప్ స్టేటస్ ఎందుకు పెడుతావంటూ స్థానిక పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు విక్రమ్, గురప్ప, రుబేంద్ర, ఆనంద్, కృష్ణమూర్తితో పాటు పలువురు శుక్రవారం పొలం వద్ద పనిచేస్తున్న తన వద్దకు వచ్చి మూకుమ్మడిగా దాడిచేశారని ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తంచేశాడు. ఇక ఇలాంటి స్టేటస్‌లు పెట్టినా, పార్టీ పేరు ఎత్తినా కాళ్లు చేతులు విరిచేస్తామంటూ భయభ్రాంతులకు గురిచేశారన్నాడు. అంతే కాకుండా టీడీపీ నాయకులకు క్షమాపణలు చెప్పాలని హుకుం జారీచేశారని కన్నీటి పర్యంతమయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడి వద్ద వివరాలు సేకరించారు.